తెలంగాణ భవన్‌లో సంబురాలు

బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదివారం పార్టీ అభ్యర్థులకు బీ ఫారాలు అందజేశారు. అనంతరం పార్టీ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల నుంచి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ రాష్ట్ర కార్యాలయమైన తెలంగాణభవన్ వద్ద పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు.

గాంధీ భవన్‌లో దిష్టిబొమ్మ దహనాలు

టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ టికెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ పలువురు నాయకులు పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్ ఎదుట ఆదివారం ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

కాంగ్రెస్‌లో టికెట్ల కొట్లాట

- తొలి జాబితా నేపథ్యంలో నిరసనలు
- గాంధీభవన్ ముట్టడించిన మైనార్టీలు
- గేటుకు తాళం వేసి నిరసన తెలిపిన గద్వాల నియోజకవర్గ కార్యకర్తలు
- రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం
- టికెట్లు అమ్ముకున్నారని ఆరోపణలు
- మల్లు రవి ప్రెస్‌మీట్‌ను అడ్డుకున్న మైనార్టీలు నాయకులు
- కొల్లాపూర్ పార్టీ ఆఫీసులో రచ్చరచ్చ
- జగదీశ్వర్ వర్గీయుల మండిపాటు
- మేడ్చల్ అభ్యర్థి జంగయ్యకు పరాభవం
- ఉప్పల్‌లో నేతల నిరసనలు

ఆదివారం అర్ధరాత్రి అయినా గాంధీభవన్‌లో నిరసన కొనసాగిస్తున్న కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్/సిటీబ్యూరో/కీసర/కొల్లాపూర్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ తొలి జాబితా ఆ పార్టీలో అగ్గి రాజేసింది. వివిధ సామాజికవర్గాల్లో అసమ్మతి సెగలు ఎగిసిపడ్డాయి. ఆదివారం 55 మంది అభ్యర్థులతో జాబితా ప్రకటించడమే ఆలస్యం ఆ పార్టీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి. టికెట్ల రేసులో భంగపడ్డ ఆశావహులు, మద్దతుదారులు కోపోద్రిక్తులయ్యారు. ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగారు. టికెట్లు అమ్ముకున్నారని ఆరోపిస్తూ పలుచోట్ల పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. పాతబస్తీకి చెందిన మైనార్టీ నేతల తోపాటు గద్వాల నియోజకవర్గానికి చెందిన పలువురు కార్యకర్తలు ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌ను ముట్టడించారు. గద్వాల కార్యకర్తలు గాంధీభవన్ లోపలి గేటుకు తాళం వేయడం పరిస్థితి తీవ్రతకు అద్దంపట్టింది. మేడ్చల్, ఉప్పల్, కొల్లాపూర్ తదితర నియోజకవర్గాల్లోనూ అసంతృప్త సెగలు ఎగిసిపడ్డాయి. రేవంత్ కబంధహస్తాల నుంచి పార్టీని కాపాడాలంటూ నినాదాలు చేశారు. పలు నియోజకవర్గాల్లోని కీలకనేతలు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తామని ప్రకటించారు. సగం కంటే తక్కువ స్థానాలకే అభ్యర్థులను ప్రకటిస్తేనే ఈ స్థాయిలో రచ్చ జరిగితే ఇక మొత్తం స్థానాలకు అభ్యర్థుల జాబితా విడుదలైతే పరిస్థితి ఇంకెలా ఉండేదోనని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

మేడ్చల్ అభ్యర్థి జంగయ్యకు పరాభవం

మేడ్చల్‌లో కాంగ్రెస్ వర్గవిబేధాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. మేడ్చల్ టికెట్‌ను బోడుప్పల్ నివాసి తోటకూర జంగయ్యయాదవ్‌కు కేటాయించడంతో ఆ టికెట్‌ను ఆశించిన హరి వర్ధన్‌రెడ్డి ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఆయనను కలిసేందుకు వచ్చిన జంగయ్యయాదవ్‌కు తీవ్ర పరాభవం ఎదురైంది. ఆదివారం కాంగ్రెస్ తొలి జాబితా విడుదలైన తరువాత హరివర్ధన్‌రెడ్డి తన అనుచరులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతున్న సమయంలోనే జంగయ్యయాదవ్ అక్కడకు రావడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. జంగయ్యయాదవ్ గోబ్యాక్ అంటూ హరివర్ధన్‌రెడ్డి వర్గీయులు నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల కార్యకర్తలు దుర్భాషలాడుతూ, గల్లాలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది.

ఉప్పల్‌లో తారస్థాయికి చేరిన నిరసనలు

ఉప్పల్ అభ్యర్థిగా పరమేశ్వర్‌రెడ్డిని ప్రకటించడంతో టికెట్ ఆశించి, భంగపడిన రాగిడి లక్ష్మారెడ్డి వర్గీయులు భగ్గుమన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ ఫ్లెక్సీలను చించివేసి, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. మరోవైపు ఏఎస్‌రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష, ఆమె భర్త, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సోమశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా ప్రకటించారు.

అంజన్‌కుమార్‌పై అసంతృప్తి

ముషీరాబాద్ టికెట్‌ను హైదరాబాద్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌యాదవ్‌కు కేటాయించడంపై పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌ముదిరాజ్ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో తన కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు.

కొల్లాపూర్‌లో రచ్చరచ్చ

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి సెగలు భగ్గుమన్నాయి. కొల్లాపూర్ టికెట్‌ను ఇటీవల పార్టీలో చేరిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కేటాయించడంతో ఆ టికెట్‌ను ఆశించిన చింతలపల్లి జగదీశ్వర్‌రావు వర్గీయులు కోపోద్రిక్తులయ్యారు. కొల్లాపూర్‌లో జగదీశ్వర్‌రావు ఏర్పాటు చేసుకున్న పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్న ఆయన అనుచరులు ఆగ్రహంతో ఊగిపోయారు. కార్యాలయంపై ఏర్పాటు చేసిన బోర్డుతోపాటు రేవంత్‌రెడ్డి, వంశీకృష్ణ, మల్లురవి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను చించేశారు. వాటికి నిప్పుపెట్టేందుకు ప్రయత్నిస్తుండగా కార్యాలయ సిబ్బంది అడ్డుకున్నారు. జగదీశ్వర్‌రావు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయకపోతే, భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరిస్తున్నారు. సోమవారం చింతలపల్లి సమావేశమై తమ భవిష్యత్ కార్యాచరణను అనుచరులతో చర్చించనున్నారు. పార్టీ నాయకులు, అభిమానుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఆ దిశగా ముందుకు వెళ్తామని చింతలపల్లి తెలిపారు.

గాంధీభవన్ ముట్టడి

పాతబస్తీలోని పలు సీట్లను మైనార్టీలకు కాకుండా స్థానికేతరులకు, ఇతర సామాజికవర్గాల వారికి కేటాయించడంతో ఆయా టికెట్లను ఆశించిన మైనార్టీ నేతలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. గాంధీభవన్‌ను ముట్టడించడమే కాకుండా ఆ పార్టీ సీనియర్ నేత మల్లు రవి ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌ను అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బహదూర్‌పుర టికెట్‌ను రాజేశ్‌కుమార్‌కు కేటాయించడంపై యూసఫ్‌దానిష్ వర్గీయులు ఆగ్రహం వ్యక్తంచేశారు. చాంద్రాయణగుట్ట టికెట్ కేటాయింపు విషయంలోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. యాకత్‌పురతో సంబంధం లేని రవిరాజుకు టికెట్ ఎలా కేటాయించారని నిలదీశారు. మలక్‌పేట టికెట్‌ను అక్బర్‌కు కేటాయించడంతో ఆ టికెట్ ఆశించిన ముజఫర్ మద్దతుదారులు ఆందోళనకు దిగారు. దీంతో మల్లు రవి ప్రెస్‌మీట్‌ను రద్దు చేసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత కూడా ఆశావహుల మద్దతుదారులు గాంధీభవన్ వద్ద ఆందోళనను కొనసాగించారు.

జూపల్లికి టికెట్ ఎలా ఇస్తారు?: ఖాదర్‌పాషా

నెల క్రితమే పార్టీలో చేరిన జూపల్లి కృష్ణారావుకు టికెట్ ఎలా ఇస్తారని పీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖాదర్‌పాషా ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించకుండా ప్యారాచూట్ నేతలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ టికెట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మాటలను నమ్మి జగదీశ్వర్‌రావు రూ.కోట్ల ఖర్చు చేశారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో అధినాయకత్వం చెప్పేదొకటి, చేసేది మరొకటని మండిపడ్డారు.

65 సీట్లు 600 కోట్లకు అమ్మకం

- రేవంత్ వసూళ్లపై ఐటీ, ఈడీకి ఫిర్యాదు చేస్తాం
- రేవంత్‌రెడ్డిని జిల్లాల్లో తిరగనివ్వం
- ఓయూ విద్యార్థి నేత కురవ విజయ్‌కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): పీసీసీ అధ్యక్షుడు రాష్ట్రంలోని 65 నియోజకవర్గాల టికెట్లను రూ.600 కోట్లకు అమ్ముకున్నారని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేత కురవ విజయ్‌కుమార్ ఆరోపించారు. దీనిపై వెంటనే అధిష్ఠానం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రూ.600 కోట్ల వసూళ్లపై ఊరుకునే ప్రసక్తే లేదని, ఈడీ, ఐటీలకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఆదివారం ఆయన తన అనుచరులతో కలిసి గాంధీభవన్‌ను ముట్టడించిన అనంతరం. మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. చంద్రబాబు అండ్‌కో కబంధ హస్తాల నుంచి కాంగ్రెస్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని విమర్శించారు. మునుపెన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ టికెట్లు అమ్ముకున్నారని మండిపడ్డారు. గద్వాల టికెట్‌ను రూ.10 కోట్ల క్యాష్, 5 ఎకరాల భూమికి కొనుక్కున్నట్టు టికెట్ పొందిన సరితా తిరుపతయ్య బాహాటంగా చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. గద్వాల మాత్రమే కాకుండా 65 నియోజకవర్గాల అభ్యర్థుల నుంచి తన కుటుంబసభ్యులు, చెంచాల ద్వారా వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. నోట్లు, ఓట్లు, సీట్ల అమ్మకాలు, కొనుగోళ్లలో ఆరితేరిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ పరువును గంగలో కలుపుతున్నారని ధ్వజమెత్తారు. నమ్మించి మోసం చేసిన రేవంత్‌రెడ్డిని తమ జిల్లాలో తిరగనివ్వబోమని, తరిమి కొడతామని హెచ్చరించారు.

సీపీఐలో మునుగోడు లొల్లి

- కాంగ్రెస్‌తో పొత్తులో సీటు లేదంటూ నెల్లికంటి సత్యం ఫైర్
- కూనంనేని సాంబశివరావు తీరుపై క్యాడర్‌కు అనుమానాలు
- పొత్తు లేకపోయినా పోటీకి సిద్ధమంటున్న ఆ పార్టీ కార్యకర్తలు

నల్లగొండ, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/హైదరాబాద్, (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీతో పొత్తు అంశం సీపీఐలో చిచ్చురేపుతున్నది. పొత్తులో భాగంగా ఆది నుంచీ మునుగోడును ఆ పార్టీ బలంగా కోరుతున్నది. బీఆర్ఎస్‌తో చర్చల సమయంలోనూ, తాజాగా కాంగ్రెస్ పొత్తులోనూ మునుగోడును సీపీఐకి కేటాయించాల్సిందేనని నల్లగొండ జిల్లా నేతలు పట్టుబట్టారు. ముందు నుంచి జరిగిన ప్రచారం మేరకు సీపీఐ బెల్లంపల్లి, హుస్నాబాద్, కొత్తగూడెం, మునుగోడు స్థానాలు కావాలని కోరుతూ వచ్చింది. నాలుగు స్థానాలు కేటాయించలేమని, రెండు చోట్ల మాత్రమే సర్దుబాటు చేయగలమని కాంగ్రెస్ నాయకత్వం తేల్చి చెప్పింది. ఇందులో కొత్తగూడెం కూడా ఇవ్వలేమని చెప్పినట్టు సమాచారం. రెండు సీట్లు మాత్రమే ఇస్తామని, అందులో ఒకటి జనరల్, మరొకటి రిజర్వుడు స్థానం కేటాయిస్తామని కాంగ్రెస్ వెల్లడించింది. ఆదివారం కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా కొత్తగూడెంతోపాటు చెన్నూరును సీపీఐకి కేటాయిస్తున్నట్టు ప్రకటన వచ్చింది. దీంతో ఒక్కసారిగా నల్లగొండ జిల్లాలో ఆ పార్టీ నేతలు భగ్గుమన్నారు. జనరల్ స్థానమైన కొత్తగూడెం కోసం మరో జనరల్ స్థానమైన మునుగోడును బలిపెట్టి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన చెన్నూరును తీసుకున్నారని నల్లగొండ జిల్లా సీపీఐ కార్యదర్శి నెల్లికంటి సత్యం మండిపడ్డారు. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సొంత ప్రయోజనాల కోసమే మునుగోడును వదిలేశారని ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్‌తో పొత్తు కుదరకపోవడానికి కూడా కొత్తగూడెం సీటు విషయంలో కూనంనేని సాంబశివరావు వ్యవహారశైలే కారణమన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేవలం తన సీటు కోసమే బీఆర్ఎస్‌కు దూరమై కాంగ్రెస్‌కు దగ్గరయ్యేలా ఆయన వ్యవహరించారని చెప్తున్నారు. మునుగోడు నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని నెల్లికంటి సత్యం స్పష్టం చేశారు.

రామంతాపూర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ఓడిపోయే సీట్లు బీసీలకు

- టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ మాయాజాలం
- జీహెచ్ఎంసీలో ఏడు స్థానాలు, పాతబస్తీలోనే నాలుగు సీట్లు
- అపహాస్యం చేశారంటూ రగిలిపోతున్న బీసీ నేతలు

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ టికెట్ల కేటాయింపుల్లో తమను అపహాస్యం చేసిందనే అభిప్రాయం బీసీ వర్గం నేతల్లో వ్యక్తమవుతున్నది. ఆదివారం ప్రకటించిన తొలి జాబితాలో బీసీలకు 12 సీట్లు కేటాయించిన కాంగ్రెస్.. ఓడిపోయే సీట్లనే అంటగట్టిందనే విమర్శలు వస్తున్నాయి. వీటిలో కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ బలం లేని జీహెచ్ఎంసీలోనే ఏడుసీట్లు ఉండగా, పాతబస్తీలోనే నాలుగు సీట్లు కేటాయించడంపై బీసీ వర్గాలు విస్తుపోతున్నాయి. చాంద్రాయణగుట్టలో బోయ నగేశ్, యాకుత్‌పురలో కే రవిరాజు, బహదూర్‌పురలో పులిపాటి రాజేశ్‌కుమార్, గోషామహల్‌లో మొగిలి సునీతకు సీట్లు కేటాయించింది. మిగిలిన జిల్లాల్లోనూ దాదాపుగా ఓడిపోయే సీట్లనే బీసీలకు కేటాయించింది. ఎంఐఎం బలంగా ఉన్న పాతబస్తీ సీట్లు, బీఆర్ఎస్ బలంగా ఉన్న సీట్లను బీసీలకు కేటాయించడంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరించారని ఆ వర్గం నేతలు మండిపడుతున్నారు.

కాంగ్రెస్ తొలి జాబితాలో బీసీ నేతలకు కేటాయించిన సీట్లు

- గోషామహల్ - మొగిలి సునీత
- చాంద్రాయణగుట్ట- బోయ నగేశ్(నరేశ్)
- యాకుత్‌పుర- కే రవిరాజు
- బహదూర్‌పుర- పులిపాటి రాజేశ్‌కుమార్
- సికింద్రాబాద్- ఆదం సంతోష్‌కుమార్
- రామగుండం- రాజ్‌ఠాకూర్
- వేములవాడ- ఆది శ్రీనివాస్
- మేడ్చల్ - తోటకూర జంగయ్యయాదవ్
- ముషీరాబాద్- అంజన్‌కుమార్‌యాదవ్
- గద్వాల- సరితా తిరుపతయ్య
- షాద్‌నగర్-శంకరయ్య
- ఆలేరు- బీర్ల ఐలయ్య

పారాచ్యూట్ నేతలకే ప్రాధాన్యం

- తొలి జాబితాలో 11 టికెట్లు వారికే
- రగిలిపోతున్న కాంగ్రెస్ పాత నేతలు
- అభ్యర్థులకు సహకరించేది లేదంటూ సీనియర్ల ఆగ్రహం
- రాజీనామాల దిశగా అడుగులు

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఎన్నో ఏండ్లుగా పార్టీని నమ్ముకొని పని చేస్తున్నవారికి కాకుండా పారాచ్యూట్ నేతలకే టికెట్లు కేటాయించారని కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ప్రకటించిన కాంగ్రెస్ తొలి జాబితాలో కొత్తగా పార్టీలో చేరిన 11 మందికి టికెట్ల కేటాయించారు. ఇందులో వారం, పది రోజులు, నెల క్రితం పార్టీలో చేరినవారికి కూడా టికెట్లు కేటాయించడంతో ఆయా టికెట్లపై ఆశలు పెట్టుకున్న వారు రగిలిపోతున్నారు. పలువురు నేతలు పార్టీకి రాజీనామాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొత్తగా పార్టీలో చేరి టికెట్లు పొందినవారిలో కసిరెడ్డి నారాయణరెడ్డి (కల్వకుర్తి), మైనంపల్లి హన్మంతరావు (మల్కాజిగిరి), మైనంపల్లి రోహిత్ (మెదక్), జూపల్లి కృష్ణారావు (కొల్లాపూర్), వేముల వీరేశం (నకిరేకల్), ఏ చంద్రశేఖర్ (జహీరాబాద్), సునీల్‌రెడ్డి (బాల్కొండ), వినయ్‌కుమార్‌రెడ్డి (ఆర్మూర్), శ్రీహరిరావు (నిర్మల్), కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), సరితా తిరుపతయ్య (గద్వాల) ఉన్నారు. ఈ పరిణామాన్ని పాత నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇన్నేండ్లుగా పార్టీ కోసం పనిచేస్తే తమకు దక్కిన గౌరవం ఇదేనా? అని మండిపడుతున్నారు. నిన్న మొన్నటి వరకు పారాచ్యూట్ నేతలతో కొట్లాడిన తాము ఇప్పుడు వారి కింద ఎలా పనిచేస్తామని ప్రశ్నిస్తున్నారు. పార్టీలో చేరినవారికి సహకరించేది లేదని తెగేసి చెప్తున్నారు.

- బాల్కొండలో సునీల్‌రెడ్డి నాలుగు నెలల క్రితమే కాంగ్రెస్‌లో చేరగా ఆయనకు టికెట్ లభించింది. దీంతో అక్కడ ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, అనిల్ తమకు అన్యాయం జరిగిందని భావిస్తున్నారు.
- ఆర్మూర్‌లో రెండు నెలల క్రితమే పార్టీలో చేరిన వినయ్‌కుమార్‌రెడ్డికి టికెట్ దక్కింది.
- గద్వాలలో సరితాతిరుపతయ్యకు టికెట్ ఇవ్వడంతో విజయకుమార్, పటేల్ ప్రభాకర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.
- నాగర్‌కర్నూల్‌లో కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి టికెట్ కేటాయించడంతో ఆ పార్టీ సీనియర్ నేత నాగం జనార్ధన్‌రెడ్డి రగిలిపోతున్నారు. ఆయన సోమవారం కార్యకర్తలతో సమావేశమై కార్యాచరణ ప్రకటించనున్నారు.
- కల్వకుర్తిలో వారం క్రితమే పార్టీలో చేరిన కసిరెడ్డి నారాయణరెడ్డికి టికెట్ ఇచ్చారు. దీంతో అక్కడ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆగ్రహంతో అన్నారు.
- కొల్లాపూర్ టికెట్‌ను జూపల్లి కృష్ణారావుకు కేటాయించడంతో సీనియర్ నేత జగదీశ్వర్‌రావు రగిలిపోతున్నారు. అనుచరులు కొల్లాపూర్ పార్టీ ఆఫీసును ధ్వంసం చేశారు.
- నకిరేకల్ టికెట్‌ను వేముల వీరేశంకు ఇవ్వడంపై స్థానిక నేతలు దైద రవీందర్, వేదాసు శ్రీధర్ ఆగ్రహంతో ఉన్నారు.

కాంగ్రెస్‌ను బీసీలు ఎట్ల నమ్ముతరు?

- ప్రతీ పార్లమెంట్ పరిధిలో బీసీలకు 2 సీట్లు కేటాయిస్తామని చేసిన తీర్మానం ఎటు పోయింది?
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ నిలదీత

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ప్రతీ పార్లమెంట్ పరిధిలో బీసీలకు రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తామని తీర్మానం చేసిన కాంగ్రెస్ దానిని అమలు చేయకపోవడం సిగ్గుచేటని, ఆ పార్టీని బీసీలు ఎట్ల నమ్ముతారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ ప్రశ్నించారు. 55 మంది అభ్యర్థులతో తొలిజాబితాను విడుదల చేసిన కాంగ్రెస్.. రెడ్లకు 17 సీట్లు, వెలమలకు 7 సీట్లు, మొత్తం అగ్రకులాలకు 26 సీట్లు కేటాయించి, బీసీలకు మాత్రం 12 సీట్లు కేటాయించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు టికెట్లు ఇస్తామని ఉదరగొట్టి ఇప్పుడు దగా చేసిందని, దీంతో కాంగ్రెస్ కథ కంచికేనని, ఓటమి తప్పదని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీలో ఉండి జెండా మోసిన బీసీలను కాదని, డబ్బు సంచులున్న వాళ్లకు, పార్టీ మారిన వాళ్లకు టికెట్లు ఇచ్చి బీసీ నేతలకు మొండిచేయి చూపారని ధ్వజమెత్తారు. మిగతా సీట్లలోనైనా ఓడిపోయే పాతబస్తీ లాంటి స్థానాలు కాకుండా గెలిచే స్థానాల టికెట్లు ఇవ్వాలని కోరారు.

రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ ఖతం

- పార్టీని నమ్ముకున్నోళ్లందరినీ పీసీసీ చీఫ్ నిండా ముంచాడు
- మోసాలను తట్టుకోలేకే రాజీనామా
- ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, శిరీష దంపతులు

ఖైరతాబాద్, అక్టోబర్ 15: 'టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఖతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. టికెట్లు అమ్ముకొని పార్టీని నమ్ముకున్నోళ్లను నిండా ముంచాడు. ఆయన వైఖరి నచ్చకనే నేను, నా భార్య కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నాం' అని ఆ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం తన సతీమణి, ఏఎస్‌రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషతో కలిసి ఆయన రేవంత్‌రెడ్డిపై దుమ్మెత్తిపోశారు. తాను దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేశానని, తన కుటుంబసభ్యులు కూడా ఆ పార్టీలోనే అనేక పదవులను చేపట్టారని గుర్తుచేశారు. 2014లో తనకు టికెట్ ఇస్తానని చెప్పి ఇవ్వలేదని, 2018లో పొత్తుపేరుతో మరోసారి మోసగించారని, నేడు రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకొని తనకు మొండిచేయి చూపాడని మండిపడ్డారు. నాడు రేవంత్ టీడీపీని నాశనం చేశాడని, నేడు కాంగ్రెస్ పార్టీని సైతం చేస్తున్నాడని విమర్శించారు. ప్రస్తుతం టికెట్లు దక్కించుకున్న అభ్యర్థుల్లో అధిక శాతం రేవంత్‌రెడ్డి చలవతోనే వచ్చారని, కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. వారందరినీ ప్రైవేట్ ఆర్మీలా తయారు చేసుకున్నాడని, ఆయనకు ముఖ్యమంత్రి పదవీ ఇవ్వకుంటే తిరుగుబాటు చేస్తానని అధిష్ఠానాన్ని బెదిరించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడని విమర్శించారు. టీడీపీ నుంచి వచ్చిన రేవంత్‌ను అందరూ ఛీత్కరించుకుంటే తానే రేవంత్ టీమ్‌ను తయారు చేసి తన సొంత ఖర్చులతో అతనికి కాన్వాయ్‌ని ఏర్పాటు చేశానని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది రేవంత్‌రెడ్డి బాధితులు ఉన్నారని, రేపటి నుంచి ఆయన ఓటమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ప్రజలకు ఏ పార్టీ మంచి చేస్తుందో ఆ పార్టీలోనే చేరుతానని స్పష్టంచేశారు.

డబ్బులివ్వలేదని.. టికెట్ ఇవ్వలేదు

- ప్రతి నియోజకవర్గంలో ముగ్గురితో రేవంత్ చీకటి ఒప్పందాలు
- ఉప్పల్ కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ఆగ్రహం

రామంతాపూర్, అక్టోబర్ 15: జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి డబ్బులు అడిగితే తాను ఇవ్వలేదనే కక్షతో ఇప్పుడు టికెట్ కేటాయించలేదని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి ఆరోపించారు. 25 ఏండ్లుగా పార్టీ కోసం కష్టపడ్డానని, తనలాంటి వారిని మోసం చేసిన రేవంత్‌కు ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. ఆదివారం హబ్సిగూడలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. పీసీసీ చీఫ్‌వి కాదు.. అప్స్టాల్ మనిషివని మర్చిపోవద్దని హితవుపలికారు. ఫహీం అనే వ్యక్తిని పక్కన పెట్టుకొని రేవంత్ నియంతలా వ్యవరిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ ప్రతి నియోజకవర్గంలో ముగ్గురితో చీకటి ఒప్పందాలు చేసుకొని, పార్టీలో ఉన్నవారిని బయటకి పంపి, కాంగ్రెస్ టికెట్లు అమ్ముకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని, లేఖను పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేకు పంపుతానని లక్ష్మారెడ్డి తెలిపారు. రెండు రోజుల్లో తన తదుపరి కార్యాచరణను ప్రకటిస్తానని చెప్పారు. కాగా, రాగిడి లక్ష్మారెడ్డికి కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడంపై అభిమానులు, కార్యకర్తలు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.